YOUNG INTELLECTUAL

ESTABLISHED AUGUST - 2024
BILINGUAL (TELUGU AND ENGLISH)- QUARTERLY - MULTIDISCIPLINARY -
OPEN ACCESS - E - JOURNAL FOR DEGREE COLLEGE STUDENTS AND FACULTY
Published by : D. Yeswanth Reddy, c/o. Tirupathi Reddy, 16-183/1, Ramakrishna Colony,
Mylavaram, NTR District, Andhra Pradesh. Pin : 521230, mail ID : yeswanth.devarapalli@gmail.com

11

# నవ్వాలను కొంటె కథలు – హాస్య పరిశీలన

**ఎన్. శ్రీకాంత్**
తెలుగు అధ్యాపకులు
యస్.ఆర్.ఆర్ & సీ.వీ.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
విజయవాడ.
సెల్: 9985138335.
namasrikanth002@gmail.com

ఆధునిక కాలంలో మన జీవితాలు ఉరకలు పరుగుల మయం అయింది కనుక తనువు, మనసులు సహజ ఔషధం ఏమిటని వెదికితే హాస్యమే ఆ ఔషదమని చెప్పవచ్చు. హాస్యం మనిషికి ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని ఇచ్చి తద్వారా ఆయుష్షు పెంచటానికి కూడా తోడ్పడుతుంది. అటువంటి హాస్యం ఎలా దొరుకుతుంది? ఎక్కడ దొరుకుతుంది ? అనే ప్రశ్నలకు సమాధానంగా మనకు తట్టే అంశాలను రెండు రకాలుగా చెప్పవచ్చు.

మొదట మన చుట్టూ జరిగే విషయాలను, మనుషులను, వారి అలవాట్లను, భాషా, వేషం, ఇత్యాది అంశాలను జాగ్రత్తగా గమనిస్తూ వెళితే మన జీవితానికి సరిపడా హాస్యరసాన్ని ఆస్వాదించవచ్చు. అయితే మనకి ఎవరితో ఏమి మాట్లాడితే ఏమౌతుందో! ఎవరు ఏమి అనుకుంటారో! అనే సందేహాలతో సతమతమౌతూ ఎదుటివారికి స్పందించే, హాస్యాన్ని ఆస్వాదించే అవకాశం వచ్చినా ఒంటరిగానో, స్నేహితుల దగ్గరో, అదీ కాదంటే ప్రసార మాధ్యమాల కార్యక్రమాలు చూసి నవ్వే భోగాన్ని పొందుతున్నాం. రెండవ మార్గం సాహిత్య అధ్యయనం తెలుగు సాహిత్యంలో సాహిత్యకారులు సృజించిన హాస్యం మన తెలుగు వాళ్ళకు తక్కువేమీ లేదు. ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియల్లో సందర్భం వచ్చినప్పుడల్లా రచయితలు హాస్యాన్ని చొప్పించి పాఠకులను నవ్వుల జల్లులో తడిపిన వారే. అందులోను నవ్వులను కొంటె కథల్లో ప్యాక్ చేసి చిక్కనైన హాస్యాన్ని మనకందించిన ప్రముఖ రచయిత పోలా ప్రగడ సత్యనారాయణ మూర్తి గారు. వీరి 'నవ్వాలను కొంటె కథలు' అనే కథా సంపుటిలోనూ హాస్యం ఏవిధంగా పండిందో పరిశీలిద్దాం. రచయిత వారి కథల గురించి... "ఈ కథలు రాసింది, కాసేపు చదువుకొని నవ్వుకొని, ఆనందించడానికి కష్టాలూ కన్నీళ్ళూ బరువులూ బాధలూ ఈ పేజీల్లో కనిపిస్తాయేమో అని వెతకడం వృధాశ్రమ" అని తన లక్ష్యాన్ని వెల్లడి చేశారు.

ఈ కథల్లో వ్యక్తుల ఇష్టాయిష్టాలు, హావభావాలు, చేష్టలు, సంభాషణలు, ఊహలు, వ్యక్తుల స్వరూప స్వభావాలను చిత్రించడం ద్వారా నవ్వులవాన కురిపించారు కథా రచయిత. వ్యక్తుల ఇష్టాయిష్టాలు వారిని ఎంత వరకైనా తీసుకుపోతాయి. అయితే వాటిని సాధించటంలో సఫలులౌతారా, విఫలులౌతారా అన్నది పక్కన పెడితే, ఆ సంఘర్షణలో పుట్టే హాస్యం పాఠకులను రంజింపచేస్తుంది. కొందరికి ఆహార పదార్థాలంటే నాలుక కోసుకుంటారు. అటువంటి వారిలో "మిత్ర ద్వయమూ – మిరియాల జున్నూ" కథలో సుబ్బారావుకి జున్నంటే ప్రాణం. రచయిత మాటల్లో చెప్పాలంటే అతడు దేన్ని అయినా సహిస్తాడు కాని, జున్ను విషయంలో తన వాదనని ఎవరైనా ఎదిరిస్తే మాత్రం భరించలేడు. అది భార్య అయినా, పిల్లలైనా సరే. ఇప్పటికి అయేది ఇరవై యేళ్ళ క్రింత అయేది. ఏదైనా సరే దాని అంతేదో తేల్చుకోనిదే ఊరుకోడు. అంటే జిహ్వాచాపల్యం ఉన్నవాడికి కాలంతో, ఎదుటి వ్యక్తులతో

పనిలేదన్నమాట. అత్తగారు తన పెళ్ళి అయిన కొత్తల్లో పదేళ్ళ క్రితం మొహమాటం కొద్దీ కొంచెం జున్ను తీయమన్నందుకు గచ్చకాయంత మిగిల్చి అంతా తీసేసిన అన్యాయాన్ని తలచుకొని భార్యతో వాదనకి దిగాడు.

ESTABLISHED AUGUST- 2024
OPEN ACCESS - E - JOURNAL FOR DEGREE COLLEGE STUDENTS AND FACULTY

తన మిత్రుడు, క్లాస్మేట్ అయిన సౌజన్యారావు ద్వారా కూడా సుబ్బారావు గురించి తినే పదార్థం జున్ను అయితే అరమోడ్పు కన్నులతో అరడజను ప్లేట్లదాకా అనాయాసంగా ఆరగించేసే సమర్థుడని, నర్సాపురం నుంచి అనకాపల్లి రావడం వల్ల జున్నుకి మొహం వాచానని ఏడుస్తూ, అక్షరాలా ఏడుస్తూ, ఈ మధ్య తనకి వారానికో ఉత్తరం రాస్తున్న దురదృష్ట జాతకుడని చెప్పించడాన్ని బట్టి సుబ్బారావుకి గల జున్ను ప్రియత్వం ద్యోతకమవుతుంది. అక్షరాలా ఏడుస్తూ, ఉత్తరాలు రాయడమంటే సుబ్బారావు రాసే ఉత్తరాల్లో కూడా జున్ను ప్రస్తావన చేస్తాడని నర్మగర్భంగా కథకుడు సూచించారు.

సౌజన్యారావుకు మిత్రునితో కలిసి తన కమతంలో ఈనిన మూడు గేదెల జున్నును తినాలని కోరిక. అది ఎంత బలమైనదంటే ఆ కార్యసాధన కోసం "షీ బఫెలోస్ డెలివర్డ్ స్టార్ట్ ఇమ్మీడివెట్లీ" అని టెలిగ్రాం పంపుతాడు.

ఈ బఫెలోస్ పదంలో 'యస్' నిజంగానే ఉంటే జున్ను కూడా బహుళంగానే ఉంటుందని ఆశపడతాడు సుబ్బారావు. అంటే జున్ను మీద ఆశ ఎంత ప్రబలంగా సుబ్బారావుకి ఉందో మనకు తెలస్తుంది. సౌజన్యారావు టెలిగ్రాం ప్రకారం నర్సాపురం వెళ్ళాలని నిర్ణయించుకొని జున్ను రుచి తెలియని ప్రిన్సిపాల్ అసలు విషయం చెబితే సెలవు ఇవ్వడని అర్జెంటుగా ఒక ఊరు వెళుతున్నానని చెప్పి బయలుదేరిన సుబ్బారావుకి భార్య ఆరా తీసే ప్రశ్నలు జున్ను మధ్యలో తగలే మిరియం పొడిలాగా తోస్తాయి. దీన్ని బట్టి ఎదుటి వారిని అంచనా వేయడంలో అతని లోకజ్ఞత మనకు నవ్వు తెప్పిస్తుంది.

నిడదవోలులో రైలు ఎక్కి నిద్రించటం వల్ల రైలు నర్సాపురం వెళ్ళి తిరిగి నిడదవోలు రావడంతో తనకు తాను నమ్మలేకపోతాడు. ఆ క్రమంలో "రైల్వే స్టేషన్లు, గేదెలు, మేజోళ్ళు, ఇంగ్లీషువాళ్ళు, రెండు జడల అమ్మాయిలు – వీటిని గుర్తుపట్టడం మహాకష్టం" అనుకోవడం కథకుడు అందుకు తీసుకున్న ఉదాహరణలు మంచి వ్యంగ్యోక్తులు.

నర్సాపురం జున్ను విందు కోల్పోయాననుకొని భార్యతో అబద్ధాలు చెప్పిన సుబ్బారావుకి కాలేజీ అయిపోయాక ఇంటికి వెళ్ళగానే తాను అక్కడే అబద్ధాల గుట్టు బయటపెట్టిన ఆగంతుకునిలా సౌజన్యారావు కనిపించినా ఆ తరువాత జున్ను రూపంలో అదృష్టం వెతుక్కుంటూ వచ్చినట్లు భావిస్తాడు.

తాను చేసే ఉద్యోగాన్ని నిడదవోలు నర్సాపురాల మధ్య నడిచే రైలుతో పోలుస్తూ జూనియర్ ఇంటర్ క్లాసుకి సీనియర్ డిగ్రీ క్లాసుకీ మధ్యనే అటూ ఇటూ తారట్లాడే తన బోటి కాలేజీ లెక్చరర్ జీవితం లాంటిదే దీని బతుకూనూ అంటే ప్రమోషన్ల తీరు ఇలా ఉంటుందనీ.... ఇందులో ప్రయాణం చేసినవారు ఎంత దూరం అయినా పోతారు. ఇది మాత్రం నరసాపురం వెళ్ళి రైట్ ఎబౌటు టర్న్ అంటూ ఎన్.సి.పి. కేడెట్ లాగ దర్జాగా వెనక్కి తిరిగి నిడదవోలు రావలసిందే.

అంటే ఇక్కడ ప్రయాణీకులు విద్యార్థులనీ, లెక్చరర్ రైలుబండి అనే అర్థాన్ని స్ఫురింపజేసిన రచయిత తన అనుభవాన్ని జోడించి పాఠకులని హాస్య చకితుల్ని గావిస్తారు. కొందరికి కొన్ని ప్రదేశాలంటే అపారమైన ఇష్టం ఉంటుంది. ఇష్టమైన ప్రదేశాన్ని దర్శించాలని, అదృష్టం కలిసొస్తే అక్కడ నివసించాలనీ ఆశ కలిగి ఉంటారు. ఈ

రోజుల్లో స్టేట్స్ అనీ అబ్రాడ్ అనీ కలవరించే వాళ్ళు మనకు తారసపడటం విదితమే కదా! "అమ్మడూ హైదరాబాదు" కథలో అమ్మడుకి హైదరాబాదు అంటే పంచప్రాణాలు. అక్కడ దొరికే వస్తువులను బట్టి అది గొప్ప నగరమని ఊహించేది. రాజమండ్రి లాయరు, విజయవాడ డాక్టరు, విశాఖపట్నం లెక్చరర్, గూడూరు కాంట్రాక్టరు వంటి సంబంధాలు వచ్చినా హైదరాబాదు కాకపోవటంతో తప్పిపోయాయి. తనకు రావలసిన పెళ్ళి సంబంధం గురించి అమ్మడు భగవంతుణ్ణి ఇలా కోరుకునేది. "హైదరాబాదు పెళ్ళి కొడుకు ఎవరైనా వస్తే బాగుండును. అటువంటి వాడిని ఒకడిని పంపించు దేవా?"..... "లోపాలు ఎన్ని ఉన్నా ఏమి ఫర్వాలేదు. అతను హైదరాబాదు వాడయితే చాలు. తక్కిన ఊళ్ళల్లో కలెక్టరు కంటే, ఆ ఊళ్ళో కానిస్టేబుల్ నయం" అని తల్లిదండ్రులకు నచ్చకున్నా హైదరాబాదులో మూడు వందలకు ఒక ఆఫీసులో పనిచేసే జగదీశ్వరరావుతో వివాహం కుదిర్చే ప్రయత్నంలో అవధానులు అమ్మడు మూసీ నక్షత్ర యుక్త చార్మినార్ లగ్నమందు జన్మించి ఉంటుంది".

అందుకనే పెద్ద సంబంధాలు కుదరక ఈ సంబంధం కుదిరించంటాడు. సిద్ధాంతి రాజధాని కర్నూలు నుండి హైదరాబాదుకి మారే సమయంలో అమ్మడు పుట్టడమే హైదరాబాదు సంబంధానికి కారణమని విశ్లేషిస్తే అమ్మడికి ఓనమాలు దిద్దించిన భైరవమూర్తి మాష్టారి అనుమానమల్లా "అమ్మడికి చిన్నప్పుడు 'అత్తా తాతా' కంటే హైదరాబాదు, సికిందరాబాదు అనే మాటలే ముందు వచ్చి ఉంటాయని".

అమ్మడు ఆశించినట్లుగానే వారందరూ తొందరపెడితే అమ్మడి వివామం జగదీశ్వరరావుతో జరిగింది. హైదరాబాదుకి వెళ్ళి ఒక మురికివాడలో నివాసమని తెలిసి సత్యజిత్‌రే సినిమాల్లో లాగా ఉందని చింతించింది.

అక్కడ నిత్య సరుకుల కోసం నీళ్ళ కోసం క్యూలలో నిలబడవలసి రావడంతో 'దూరపు కొండలు నునుపు' అనే సామెతను తలపించింది అమ్మడు వైవాహిక జీవితం. తనను చూడడానికి వచ్చిన తండ్రితో సొంత ఊరికి భర్తతో సహా ప్రయాణమైంది అమ్మడు. ఈ కథలో రచయిత కొందరికి ప్రాంతాలపై ఉండే వల్ల మాలిన అభిమానాన్ని వారి ఊహలను వాస్తవికతతో పోల్చి చిత్రించడం జరిగింది.

"ఒకటో నెంబర్ బెడ్" కథలో రామశాస్త్రికి పాత కాలపు వేషం, ఆచారాలు ఒక తపస్సులా పాటించే తీరు, అమాయకత్వం, అతి వినయం కలిసిన వ్యక్తిత్వం పాఠకులను పొట్ట చెక్కలు చేస్తాయి. పెళ్ళి చేస్తే రోగం కుదురుతుందన్న నానుడిని రామశాస్త్రికి వర్తింపజేయవచ్చు.

అతనికి వచ్చిన పేరు తెలియని జబ్బు నర్సు పంకజాన్ని పెళ్ళాడటంతో కుదురుకుంటుంది. సంస్కృత కళాశాల్లో అతడు అధ్యాపకుడుగా చేరి రెండు సంవత్సరాలైనా ప్రిన్సిపాల్ చంటిపాప లాగా చూడటం, సహాధ్యాపకులు ఆటపట్టించే తీరు ఇలా ఉండేది.... " ఏం రాంశాస్త్రీ! పాలు తాగావా? ఏమిటీ మధ్యన విద్దెదంచేస్తున్నావుట! నువ్వు పుట్టాక ఎప్పుడైనా కాఫీ తాగావా? సినిమా చూశావా? ఎన్నాళ్ళిలా ఒక్కడివీ ఒండుకు తింటావోయ్! హాయిగా పెళ్ళి చేసుకోకూడదూ?" అంటూ ఎన్నో రకాల ప్రశ్నలు వేసేవాళ్ళు. అందుకు రామశాస్త్రి "వాళ్ళు పెద్దవాళ్ళు, ఏదో మన శ్రేయస్సు కోరే చెప్తున్నారు" అనుకోవడం ఇతని ప్రత్యేకత ఎవరు ఏమన్నా అన్యధా భావించే స్వభావం కాదు.

పూర్తిగా పద్దెనిమిదవ శతాబ్దానికి చెందిన అతని వేషం చూస్తే ఇంక విద్యార్థులకు తరగతి బయట నవ్వులాటగా ఉండేది. "నెత్తిమీద జానెడు పిలకా, చెవిలో నిత్యమల్లె పువ్వూ, చెవులకి చిన్నప్పుడు పెద్దవాళ్ళు కుట్టించిన పాలకాయలూ,

ESTABLISHED AUGUST - 2024
OPEN ACCESS - E - JOURNAL FOR DEGREE COLLEGE STUDENTS AND FACULTY

నొసటను విభూతికుంకుమలు, ఉతికి ఆరేసిన ముడతలు పడ్డ జుబ్బా, మడతలు వచ్చేలా అందంగా కొట్టుకున్న బిళ్ళగోచీ, పంచెకట్టూ, చెప్పులు లేని పాదాలూ" అని రామశాస్త్రి రూపురేఖలని వర్ణించారు రచయిత.

రామశాస్త్రికి "అన్నం సయించకపోవడం, ఒక్కొక్కపుడు నాడి విపరీతంగా కొట్టుకోవడం, పగలూ రాత్రి ఏదో తిక్క, రాత్రిళ్ళు ఎంత సేటపికీ నిద్ర పట్టకపోవడం" వంటి చాలా లక్షణాలు ఆరు నెలల నుండి ఉండటంతో సహచరుల సూచనలతో ఆసుపత్రిలో చేరినపుడు ఒకటో నెంబరు బెడ్ కేటాయించటం జరిగింది.

ఆచారాలు స్థలాతీతంగా పాటించటం ఇతని ప్రత్యేకతగా కథకుడు ఈ పాత్ర ద్వారా హాస్యం పండించారు. హాస్పటల్లో ఉండగానే రామశాస్త్రి "నేల మీద అంగవస్త్రం వేసి, దాని మీద మఠం వేసుకుని కూర్చుని, ఎదురుగుండా, పంచపాత్రలో ఉన్న నీళ్ళని ఉద్ధరిణి ద్వారా పురిషెడులోంచి గొంతులోని రవాణా చేస్తూ "ఓం..... కేశవాయ స్వాహా..... నారాయణాయ స్వాహా....." అనడంతో నర్సు పంకజం అడ్డుకోపోతే ఋషులు చేసే తపస్సుకు భంగం కలిగించడానికి పంపిన దేవకన్య లాగా అనిపించి ఇంకా గట్టిగా మంత్రాలు పెద్దపెట్టున చదవడం హాస్యస్ఫోరకంగా ఉంటుంది.

అందరికీ అన్ని విద్యలు తెలియాలని లేదు. అయితే తెలియదని ఊరికే ఉండటం కొందరికి నచ్చదు. అటువంటి వాటిలో వాహన చోదకత్వం, పిల్లికి చెలగాటం ఎలుకకి ప్రాణ సంకటంలా ఉండే సందర్భాలు కొన్ని సార్లు సమాజంలో మనకు ఎదురౌతుంటాయి. పీటర్ గారి స్కూటర్ కథలో అప్పటి వరకు సైకిల్‌తో జనాలని హడలెత్తించే పీటర్ స్కూటర్ కొన్నాడన్న వార్త ప్రజల గుండెల్లో రైళ్ళు కాదూ రాక్కెట్లు దూసుకుపోయేలా ఉందని వర్ణించారు రచయిత. అయితే ఏదో ఫజిల్ పోటీలో బహుమతిగా వచ్చిన స్కూటర్, దానిని నడిపిన పీటర్ గారి విన్యాసాలు సామాన్య జనాల్ని విస్మయానికి గురిచేశాయి.

సైకిల్ తొక్కేటప్పుడు దానికంటూ ప్రత్యేకమైన వేషం, ఆపకుండా గంటకొట్టడం, రద్దీగా ఉన్నప్పుడు "తప్పుకోండి తప్పుకోండి" అంటూ పెద్దపెద్ద కేకలు పెట్టేవారని పీటర్ డ్రైవింగ్ నైపుణ్యాన్ని రచయిత తెలియజేశారు.

ఇక పీటర్ గారి యాక్సిడెంట్ల గురించి, "దూరదృష్ట జీవులెవరైనా ఆయన సైకిల్ కింద పడవలసిందే కాని, కంగారుపడి ఆయన మాత్రం ఎప్పుడూ సైకిల్ మీంచి కందపడలేదు అని కథకుడు చెప్పడాన్ని బట్టి వన్‌సైడ్‌లా లాగా వన్‌సైడ్ డామేజ్ చేయాలి. ఘటనాఘటన సమర్థులుగా పీటర్ గారిని చెప్పుకోవచ్చు. ఎవరైనా సమాన స్పీడుతో వెళ్ళరేమిటని అడిగితే.... "అదే అర్థం కావడం లేదండి? ఎందుకు ఏం జరుగుతుందో ఆశ్చర్యంగా ఉంటోంది"? అని అమాయకంగా అంటారు. వీరి స్కూటర్ గురించి చెబుతూ ..... మనుష్యులు కనిపిస్తే చాలు, దానికి వీరావేశం వస్తుంది. అక్కడికి వాళ్ళు ఎంతో ఒదిగి ఒదిగి పేవ్మెంట్ల మీదకి ఎక్కేస్తూనే ఉంటారు. అయినా సరే, పగబట్టిన తాచులా వాళ్ళని తరుముతుందే కాని ఓ పట్టాన వదలదే ! అంటారు రచయిత. ఈ నైపుణ్యం స్కూటర్‌దా, పీటర్‌దా తెలియక జనం తలపట్టుకొనేలా చేయడం వారి వంతైంది.

వీరి స్కూటర్ బూచరంలా కాక నీళ్ళు కనిపిస్తే జలచరంలాగా లేదంటే వాయుచరంలా ప్రవర్తించడం, గోతులు గుట్టలు దీన్ని సూదంటు రాళ్ళలాగా ఆకర్షిస్తాయన్న వర్ణన పాఠకుణ్ణి నవ్వకుండా ఆపలేవు. మైలేజి విషయంలో పది కిమ. ఈ మాత్రమే ఇస్తుందని దాని ప్రత్యేకతను పెట్రోలు బంకు కుర్రాడు... "పూర్వజన్మలో ఇది

YOUNG INTELLECTUAL
ESTABLISHED AUGUST - 2024
BILINGUAL (TELUGU AND ENGLISH)- QUARTERLY - MULTIDISCIPLINARY
OPEN ACCESS E- JOURNAL FOR DEGREE COLLEGE STUDENTS AND FACULTY
Published by : D. Yeswanth Reddy, c/o. Tirupathi Reddy, 16-183/1, Ramakrishna Colony,

బకాసురుడో మరిడమ్మవారో నండీ! పూర్ణకుంభం పూర్తి చేస్తే కాని పూనకం రాదు దీనికి" అని అంటే .... కొందరు కథకునితో... "పునకం వచ్చి ఊరుకోవడం లేదండి బాబూ! ఆ పూనకంలో భూతబలులు కూడా పుచ్చుకుంటోంది" అన్నారని చెప్పిన తీరు హాస్యప్రియుల్ని ఆకట్టుకుంది.

ఎటొచ్చి పీటర్ గారు, వారి స్కూటర్ పూలదదండలతో సత్కరించబడటానికి కారణం రోడ్ల ప్రక్కన దూరాక్రమణలు తగ్గి రోడ్డు విశాలం కావడం ఈ కథకు కొసమెరుపు. కొందరికి ఉండే కొన్ని రకాల అభిరుచులు నాడు, నేడూ మధ్య తరగతి వర్గాన్ని కాస్త ఆలోచింపజేస్తాయి. అటువంటి అభిరుచులలో షాపింగ్ ఒకటి. ఈ అభిరుచి ఒకరికి వరంగానూ, మరొకరికి శాపంగా పరిణమించటం "మురిపెం వెల మూడు వేలు" కథలో హాస్యయుక్తంగా ప్రోలాప్రగడ సూర్యనారాయణ గారు చిత్రించారు.

సుశీల ముస్తాబు కావడం చూసిన భర్త శివరావుకి ఆరోజు ఏదో ప్రణాళిక ఉందనుకుంటాడు. మూడు వేల రెండు వందల రూపాయలు ఆ రోజే జీతంగా తీసుకుంటాము. తన భార్య షాపింగ్‌కే సిద్ధమౌతుందని కంగారుపడి "ఇంకేం ఉంది? గోవింద! తన పర్సుకి కాళ్ళు వచ్చాయి" అనుకుంటాడు.

భార్య పిలుపు యుద్ధానికి పిలుస్తున్నట్లుందని "నేను రెడీ మీరు రెడీయా" ప్రతిపక్షం పూరించిన శంఖారావం అది అవడం తన నిస్సహాయతను తెలియజేసిన తీరు పాఠకులని అలరిస్తుంది. షాపింగ్‌కు వెళ్ళే విధానాన్ని రచయిత ......." వేనిటీ చేగ్నీ వేళ్ళ మధ్య సుదర్శన చక్రంలా విలాసంగా తిప్పుతూ, కృష్ణుడి చేతిలో చక్రాన్ని లాక్కుని నరకాసురుడి మీదికి ఉరుకుతున్న సత్యభామలా" ముందు వెళ్ళుతుందని చెప్పిన దాన్ని బట్టి సుశీలకు షాపింగ్ అంటే ఎంతో హుషారో తెలుస్తుంది. అయితే ఆమె వెనకాల నడుస్తున్న తన భర్త పరిస్థితి అందుకు భిన్నంగా ....... "రెండు చేతుల్లోనూ రెండు ఖాళీ బేగ్లూ పట్టుకుని, ఉక్రోశంతో ఎరుపెక్కిన ముఖం, తొడుక్కున్న ఎర్ర చొక్కాతో పోటీ పడుతుంటే, నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ" ఉండటం భార్య షాపింగ్ అభిరుచికి అణగిపోయిన భర్త శివరావు చిత్రం మనకు దర్శింపజేశాడు కథకుడు.

షాపింగ్ యాత్ర ప్రభావ ఫలితంగా "క్రమేపీ శివరావు మోసే సరుకుల బరువు పెరిగి, పర్సు బరువు తగ్గుతోంది. ఆమె అడుగులు చురుగ్గా అతని నడక భారంగా బరువుగా "ఇలా విలోమానుపాతంలో సాగింది. వచ్చిన జీతంలో యాభై రూపాయలు ఆటోకి మినహా అన్నీ అయిపోయాయి. కథకుడు షాపింగ్ దెబ్బకు విలవిలలాడిన భర్త మనోవేదనను సాక్షాత్కరించి అభిరుచులు రేపే అలజడుల ఆకృతిని ప్రతిఫలింపజేశారు.

వంటింటి రాజకీయం కథలో వంటరాని మగవాళ్ళ పాట్లు చిత్రించటం జరిగింది. సుబ్రహ్మణ్య ప్రధాని అని మిగిలిన వాళ్ళకు పనిని బట్టి పోర్టు ఫోలియోలు నిర్ణయించి ప్రధాని బాధ్యత వంట పని అని అధికార విభజన చేశారు. అయితే అతని వంట తినలేక భార్య వెళ్లిపోయిందని చెప్పుకుంటారు.

కాఫీ వడకట్టటానికి చిదంబరం తెచ్చిన కిరసనాయిల్ గుడ్డ వాడటం, అన్నానికి బదులు లైపిండిలా ఒండటం వంటి హాస్య సన్నివేశాలు మనకు చాలా నవ్వు పుట్టిస్తాయి.

"ఆడపిల్ల తల్చుకొంటే అంతే మరి!", "ముసలి నవ్వు వెనక పడుచు కథ" కథల్లో వరుసగా వరకట్నం ఇచ్చేది లేదని అమ్మాయి, ముసలివాడు తన మనుమరాలికి వచ్చిన సంబంధానికి కట్నం ఇవ్వనని శపథం చేసి

అవే సంబంధాలనే కట్నం లేకుండా దక్కించుకోవడం ఉంటుంది. ఈవిధంగా ప్రోతాప్రగడ సత్యనారాయణ గారు తమ 'నవ్వాలను 'కొంటె' కథలు' సంపుటిని హాస్యరస భరితంగా చేయడంలో విజయవంతులైనారు.

'కవిత్వం ఒక తీరని దాహం' అన్నట్లుగానే హాస్యం నలుగురిని నవ్వించాలనే నిర్మలమైన వీరి తృష్ణ. ఈ కథా సంపుటిని పరిశీలిస్తే మనకు అవగతమౌతుంది.

వీరు ఈ సంపుటిలో పదిహేను కథలు రాసినప్పటికీ చివరలో 'నిత్య జీవితంలో హాస్యం' అనే శీర్షికతో వారి అనుభవాలను చెప్పి పాఠకులను నవ్వించాలని చేసిన ప్రయత్నం హర్షణీయం.

అమెరికన్ రచయిత మార్క్ ట్వైన్ హాస్యాన్ని గురించి చెప్పిన మాటను ......... "అసలు, మనిషి బ్రతుకే ఒక హాస్యం. అతని చేష్టలూ మాటలూ అన్నీ నవ్వు పుట్టించేవే" అని ఉదహరించారు సత్యనారాయణ గారు. కథలకు కొంటెతనాన్ని జోడించి ఈ కథలను అజరామరం చేసిన సత్యనారాయణ గారు పాఠకులను నిత్యం నవ్వే భోగులుగా ఉంచేందుకు నవ్వుల మోగిలా ఈ కథలు రూపొందించారనడం అతిశయోక్తి కాదు.